
అప్రమత్తతతోనే హెపటైటిస్‌కు చెక్



- కాలేయ వ్యాధితో పాటు కేన్సర్ ముప్పు
- జిల్లాలో పెరుగుతున్న రోగులు
- నేడు ప్రపంచ హెపటైటిస్ డే

కరీంనగర్‌టౌన్: హెపటైటిస్‌ను ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలకే ప్రమాదం తెస్తుంది. సాధారణంగా కామెర్లు హెపటైటిస్ ఏ వైరస్ ద్వారా వస్తుంది. వైద్యుల వద్ద చికిత్స పొంది.. తగినంత విశ్రాంతి తీసుకుంటే రోగి క్రమేపీ కోలుకుంటారు. లక్షణాలు పైకి కనిపించకుండా రక్తంలోనే హెపటైటిస్ బీ, సీ వైరస్లు ఉంటాయి. చాలా ఏళ్ల తర్వాత గానీ ఈ లక్షణాలు బయటపడవు. దీని కారణంగా వ్యాధి తీవ్రమై లివర్ దెబ్బతిని చికిత్సకు వీల్లేకుండానే మనిషి మరణించే దశకు చేరుకుంటారు. ఈ తరుణంలో హెపటైటిస్ వైరస్‌పై అవగాహన కలిగి ఉండటంతో పాటు వ్యాక్సిన్లను ముందుగానే వేయించుకోవాలి. జూలై 28 హెపటైటిస్ డే సందర్భంగా కథనం.

పెరుగుతున్న కేసులు

కరీంనగర్ జిల్లాలో హెపటైటిస్ కేసులు పెరుగుతున్నాయి. మద్యం అతిగా సేవించే వారిలో ఆల్కహాలిక్ హెపటైటిస్ కేసులు నమోదవుతున్నాయి. మురికివాడలు, డయాలసిస్ కేసులు, హెచ్ఐవీ ఉండే వారిలో మరింత వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. జిల్లాలో సుమారు 25వేల మంది వరకు హెపటైటిస్ బీ, సీ వైరస్‌తో బాధపడుతున్నారని సమాచారం. హెపటైటిస్ వైరస్‌లలో ఏ, బీ, సీ, డీ, ఈ రకాలు ఉన్నాయి. కలుషిత నీరు, ఆహారంతో ఏ వైరస్ వస్తుంది. విశ్రాంతి పొందడంతో పాటు తేలికపాటి ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా తగ్గి పోతుంది. డీ, ఈ వైరస్ చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి. బీ వైరస్ సోకిన వారికే డీ వైరస్ ఎక్కువగా వస్తుంది.

బీ వైరస్‌తో డేంజర్

హెపటైటిస్ బీ అత్యంత ప్రమాదకరం. చాలాకాలం పాటు ఎలాంటి లక్షణాలు కనిపించవు. ఏదైనా ఆపరేషన్ చేయాల్సి వచ్చినప్పుడు డాక్టర్లు అన్ని పరీక్షలతో పాటు హెపటైటిస్ బీ టెస్ట్ చేస్తారు. అలా చేసినప్పుడే వ్యాధి బయటపడుతుంది. ఇందులో కాలేయం గట్టిపడి.. ఆపై ఫెయిలవుతుంది. దీని ప్రభావం కిడ్నీలపై పడి అవి కూడా పాడవుతాయి. చివరికి కేన్సర్ వచ్చే ప్రమాదముంది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత పరీక్షలు



ప్రభుత్వ ఆసుపత్రులలో వైరల్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేస్తున్నాం. రోగి కోలుకునేంత వరకు పర్యవేక్షిస్తున్నాం, వ్యాక్సిన్ ఇస్తున్నాం. హెపటైటిస్ వ్యాధి ప్రమాదకరంగా మారకుండా ప్రజలు ముందస్తు పరీక్షలు చేయించుకొని వైద్యం పొందాలి.

– వీరారెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్

చికిత్స తీసుకుంటే మూడు నెలల్లో వ్యాధి నయం



హెపటైటిస్ సీ వైరస్‌కు మంచి చికిత్స వచ్చింది. పరీక్షలు చేయించుకొని చికిత్స తీసుకుంటే మూడు నెలల్లో వ్యాధి నయమవుతుంది. హెపటైటిస్ బీకి సంబంధించి మూడు నుంచి నాలుగేళ్ల వైద్యం చేయించుకోవాలి.

– డాక్టర్ పున్నం దిలీప్, సర్జికల్ గ్యాస్ట్రో

క్లుప్తంగా

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని వీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జనసాహితీ సంస్థ ఆధ్వర్యంలో జ్ఞాపకాల ఊరేగింపు వ్యాస సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీక్షణం పత్రిక ఎడిటర్ వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. ప్రతి మనిషికి జ్ఞాపకాలు ఉంటాయని అవి లేని మనిషి ఉండరని, పుస్తకం ద్వారా ప్రతి మనిషి ఆ అనుభూతిని పొందుతారని అన్నారు. సమాజం నుంచి తీసుకోవడమే కాకుండా తిరిగి సమాజానికి ఇవ్వాలని చెబుతుందని, స్వేచ్ఛా, సమాజం కోసం పరితపించిన అమరవీరుల ఆశయాలను ఎందుకు కొనసాగించాలో పుస్తకం తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. తిరుపతయ్య, కవులు పుప్పాల శ్రీరాం, కందుకూరి అంజయ్య, జనసాహితీ సంస్థ సభ్యులు విప్లవ్ దత్ శుక్లా, హుస్సేన్, ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, ప్రజాకవులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు



పీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు

ఇల్లందకుంట: స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు నాయకులు సిద్ధంగా ఉండాలని, ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీరాములపల్లిలో ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని స్థానిక బూత్ కార్యకర్తలతో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం కోసం ప్రజలకు అడ్డగోలు వాగ్దానాలు చేసిందని, అధికారంలోకి వచ్చాక హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. బీఆర్ఎస్ కాలం చెల్లిన పార్టీ అని ఆ పార్టీకి ఓటు వేయడం దండగ అనే అభిప్రాయం ప్రజల్లో ఉందని, జనం బీజేపీ వైపు చూస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి, నాయకులు ఆకుల రాజేందర్, రాజు, రమేష్, రాంబాబు, భారతి, రమేష్, నల్ల లింగారెడ్డి, రావుల విజయ్, మట్ట పవన్, పాపిరెడ్డి, సమ్మయ్య, శీలం సాయిప్రసాద్‌రెడ్డి, వనజ, శ్రీను, సారయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణం



దామోదర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

జమ్మికుంటరూరల్: మండలంలోని మడిపల్లిలో శ్రీరాజారాజేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోగా గ్రామస్తులు, కమిటీ ఏర్పాటు చేసి ఆలయ పునర్నిర్మాణం చేపడుతుండగా గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ డా.నేరేళ్ల దామోదర్ శివాలయాన్ని ఆదివారం సందర్శించారు. పునర్నిర్మాణానికి తనవంతు సాయం అందజేస్తానని హామీ ఇచ్చాడు. అనంతరం దామోదర్‌ను గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో నిన్న మొన్నటి వరకు కురిసిన వర్షాలకు జంపాల పోచయ్య ఇల్లు కూలింది. కూలిన సమయంలో ఇంటిలోని వేరే గదిలో ఉండడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

కేంద్ర మంత్రిని సన్మానించిన మున్నూరుకాపులు



ప్రొసీడింగ్ అందజేస్తున్న కేంద్రమంత్రి సంజయ్

గన్నేరువరం: మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవనం మిగులు పనుల కోసం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ రూ.ఐదు లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో సంఘం నాయకులకు ప్రొసీడింగ్ అందజేయగా మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించా రు. తక్కువ సమయంలో నిధుల మంజూరు చేసిన మంత్రితో పాటు కృషి చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుల్లెల పవన్‌కుమార్, నాయకులు సొల్లు అజయ్‌వర్మ, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం, మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్, పుల్లెల రాముల కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బొడ్డు బాలయ్య, కటకం తిరుపతి, కొట్టె భూమయ్య, కొలుపుల మోహన్, వేణు, బొడ్డు భాస్కర్, గుండా వెంకటేశం, దొగ్గలి శ్రీ నివాస్, నరేష్, పుల్లెల సాయి, పవన్‌కుమార్, జగన్మోహన్, రాము, హిమాన్షు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న కాల్వ సురేశ్

శంకరపట్నం: ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేశ్ అన్నారు. మండలంలోని కేశవపట్నంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 243 సహకార సంఘాలు ఉంటే 130 సంఘాలకు ఎన్నికలు నిర్వహించారని, మండలంలో 18 సంఘాలుంటే 8 సంఘాలకు ఎన్నికలు నిర్వహించారని, పూర్తి స్థాయిలో ఎన్నికలు నిర్వహిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రభుత్వం గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం లేదని, పశువైద్యశాలలో మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు కేశవేని రవి.గొర్ల కొంరయ్య, కనవేని తిరుపతి, సంపత్, రాజయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన



పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రమోద

జమ్మికుంట: పట్టణంలో శ్రీసత్యసాయిబాబ జయంతి సందర్భంగా శ్రీసత్యసాయి సేవా సంస్థలు, ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తనాళాల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 250 మందికి వివిధ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వాస్క్యులర్ సర్జన్ డా. ప్రమోద, ఆసుపత్రి ప్రతినిధులు కుమార్, స్రవంతి, ఆర్తి, కళ్యాణి, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, జమ్మికుంట కన్వీనర్ గన్ను సతీశ్‌కుమార్, సేవా దళ్ సభ్యులు గన్ను ప్రియ, సాయి సత్యశ్రీ, నిత్యశ్రీ, మాధురి, రాజేందర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

దీక్షకు హమాలీల మద్దతు

వీణవంక: ఉపాధి కల్పించాలని కోరుతూ మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామస్తులు చేపట్టిన దీక్ష 18వ రోజుకు చేరింది. నిరసన దీక్షకు హమాలీలు మద్దుతు తెలిపారు. 18 రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని, ఉపాధి కల్పించే వరకు దీక్ష విరమించమని స్పష్టం చేశారు. కొండపాక గ్రామంలో రెవెన్యూ గ్రామంగా హిమ్మత్‌నగర్ ఉన్నప్పటికీ ఉపాధి కల్పించకపోవడం సరికాదని, ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్ స్పందించాలని డిమాండ్ చేశారు.

నిల్వ నీటిని తొలగించాలి



ఇల్లందకుంట: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని శ్రీరాములపల్లి, సిరిసేడు, పాతర్లపల్లి, గడ్డివానిపల్లితో వివిధ గ్రామాల్లో పత్తి, ఇతర పంట చేలల్లో నీరు నిలిచిందని, నష్టం వాటిల్లనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిల్వ నీటితో పంటల్లో ఎదుగుదల ఉండదని, వేర్లు కుళ్లిపోయే ప్రమాదం ఉంటుందని కాలువల ద్వారా నీరు బయటకు పంపి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

స్నేహితుల కుటుంబాలకు అండగా..



జమ్మికుంటరూరల్: నగదు అందిస్తున్న స్నేహితులు

వీణవంక: మండలంలోని చల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1997–98 పదో తరగతి విద్యార్థులు తోటి స్నేహితుల కుటుంబాలకు అండగా నిలిచారు. తమతో చదువుకున్న కొందరు స్నేహితులు వివిధ కారణాలతో మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులకు రూ.37 వేలతో పాటు యాభై కిలోల బియ్యం అందించి ఉదారత చాటుకున్నారు. కార్యక్రమంలో ముత్యాల రవీందర్, ఉమర్, నేరేళ్ల సతీశ్, జగన్, పెద్ది విశ్వనాథ్‌రెడ్డి, నేదురు సమ్మయ్య, దూడం సదానందం, వేల్పుల రమేశ్, తదితరులు ఉన్నారు.

జమ్మికుంటరూరల్: మండలంలోని కోరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1996–97 పదో తరగతి విద్యార్థులు స్నేహితుని కుటుంబానికి ఆదివారం ఆర్థిక సాయం చేశారు. కోరపల్లిలో చదువుకున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం నాగుర్లపల్లిలో నివాసం ఉంటున్న ముత్యాల అశోక్ భార్య అనిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా స్నేహితులు రూ.20,116 ఆమె కూతురు మన్య పేరిట బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో సందీప్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, రాంబాబు, తిరుపతి ,శ్రీనివాసరావు,సదానందం, రాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం పాట్లు



కన్నాపూర్ గోదాంకు ట్రాక్టర్‌లతో వచ్చిన రైతులు

శంకరపట్నం: సాగు పనులు ఊపందుకున్న వేళ రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. యూరియా కొరత ఉండగా.. దొరకడం లేదని వాపోతున్నారు. మండలంలోని కన్నాపూర్ గోదాం వద్ద ఆదివారం సాయంత్రం యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. మెట్‌పల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో కన్నాపూర్ గోదాంకు లారీలోడ్ యూరియా వచ్చింది. విషయం తెలిసిన రైతులు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో వెళ్లారు. కొందరికి నాలుగు బస్తాల చొప్పున ఇవ్వడంతో యూరియా దక్కని రైతులు నిరాశతో వెను తిరిగారు.

అనుచిత వ్యాఖ్యలు తగదు

చొప్పదండి: అర్చక సంక్షేమం ధ్యేయంగా నిరంతరం పనిచేసే గంగు ఉపేంద్ర శర్మపై అనుచిత వ్యాఖ్యలు తగదని అర్చక ఉద్యోగ వేల్ఫేర్ బోర్డు సభ్యుడు జక్కాపురం నారాయణ స్వామి అన్నారు. రాష్ట్ర డీడీఎన్ ఉపాధ్యక్షుడు సింహాచలం ప్రభాకర చార్యులు, జిల్లా ధూప దీప నైవేద్య సంఘం అధ్యక్షులు నాగరాజు, సంపత్ కుమారాచార్యులతో కలిసి ఆదివారం మాట్లాడారు. రాష్ట్ర అర్చక సమైక్య వ్యవస్థాపకుడు ఉపేంద్రశర్మపై టి.వెంకటాద్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. డీడీఎన్ అర్చకుల గౌరవం వేతనం రూ.2500 నుంచి రూ. 6000 పెంపు చేసిన ఘనత అర్చక సమైక్య పెద్దలదేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందకుంట: మండలంలోని రాచపల్లి బస్టాండ్ ప్రధాన చౌరస్తా, ప్రభుత్వ పాఠశాల ఎదుట రోడ్డు తేలికపాటి వర్షాలకు చిత్తడగా మారుతోంది. దీంతో విద్యార్థులు, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వానొస్తే నడిచే పరిస్థితి లేకుండాపోతుందని, బస్టాప్ లోపల గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వాపోతున్నారు. రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక అవస్థలుపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సమ్మ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి, సెల్ నం.99894 95004

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

సింహగర్జన సభ విజయవంతం చేయాలి

వీణవంక: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఆగస్టు 13న జరిగే వికలాంగుల చేయూత పింఛన్‌దారుల సింహగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని వల్భాపూర్ గ్రామంలో వికలాంగులు, పింఛన్‌దారుల చైతన్య సమావేశం నిర్వహించారు. వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతు, ఇతరులకు రూ.4వేల పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని, మానసిక, గుడ్డి, చెవిటి, హెచ్ఐవీ,క్యాన్సర్, బీడీ, చేనేత కార్మికులకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింహగర్జనకు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి రాజు, ప్రధాన కార్యదర్శి దేవునూరి రవీందర్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు తునికి సంపత్, గ్రామశాఖ అధ్యక్షులు అందె కుమార్, వికలాంగుల గ్రామ అధ్యక్షులు వడ్లెల్లి చంద్రయ్య, అంతడుపుల సంపత్, మిట్టపల్లి రాజేశ్, దాసారపు అశోక్, జీడి వెంకటస్వామి, పులి ప్రకాశ్, కుమారస్వామి ఉన్నారు.

ఆర్థికసాయం

హుజూరాబాద్/శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం గ్రామంలో ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన మూల రాకేశ్ కుటుంబాన్ని ఆదివారం నాగార్జున డెయిరీ సీఈవో ప్రసాద్, ఏజీఎం సుధాకర్ పరామర్శించి రూ.లక్ష చెక్కు అందించారు. డెయిరీకి ట్రాన్స్‌పోర్టర్‌గా పని చేస్తున్న రాకేశ్ విద్యుత్‌షాక్‌తో మృతిచెందడంతో డెయిరీ ఎండీ ప్రభాకర్‌రావు ఆర్థికసాయం అందించాలని సూచించడంతో నగదు అందించామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, సంతోష్, రాహుల్, సూపర్‌వైజర్లు స్వామి, సురేశ్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు

వీణవంక: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని, మోసపూరిత హామీలతో గద్దెనెక్కారని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు కొంరయ్య, మండల అధ్యక్షుడు బత్తిని నరేశ్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల సమావేశం నిర్వహించారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటి కాషాయ జెండా ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పుప్పాల రఘు, నరసింహారాజు, గొట్టిముక్కుల సంపత్‌రావు, రాజు, గొడుగు వినోద్, దాసరి భాస్కర్, ముత్యాల రవీందర్, జీడీపల్లి రాజేశ్వర్‌రావు, దాట్ల వీరస్వామి, రామిడి తిరుపతిరెడ్డి, ఉడుత కుమార్, వెంకన్న తదితరులున్నారు.

రూ. 50 వేల విరాళం

వీణవంక: సీసీ కెమెరాల ఏర్పాటుకు మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు ఎస్సై ఆవుల తిరుపతికి రూ.50 వేల విరాళం అందించారు. గ్రామాలలో సీసీ కెమెరాలు లేక నేరాలు జరుగుతున్నాయనే ఉద్దేశంతో ఎస్సై దాతల నుంచి విరాళాలు సేకరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుకతిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాడ వనమాలసాధవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మవురపు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాయిశెట్టి లతశ్రీనివాస్ సాయం అందించడం పట్ల ఎస్సై అభినందించారు. దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు

హుజూరాబాద్: సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఎమ్మెల్యేపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అప్రమత్తతతో తప్పిన సైబర్ మోసం

గన్నేరువరం: గన్నేరువరంలో అప్రమత్తతతో సైబర్ మోసం తప్పింది. గ్రామానికి చెందిన సిరిగిరి నరేష్‌కు గ్రామ పంచాయతీ కార్యదర్శిని అంటూ 9404348431 నుంచి ఆదివారం ఫోన్‌కాల్ వచ్చింది. నరేశ్‌ను ఉచిత గ్యాస్‌కు సంబంధించి ఓటీపీ వచ్చింది చెప్పమని అడిగాడు. అనుమానం వచ్చిన నరేష్ పేరు అడగడంతో రమేశ్ అని చెప్పాడు. ఏ గ్రామ పంచాయతీ కార్యదర్శి అనగానే ఫోన్ కట్ అయిందని తెలిపాడు. గన్నేరువరం గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సైబర్ మోసాలతో ప్రజలు జాగ్రత్తంగా ఉండాలని లేకుంటే నష్టపోతారని తెలిపారు.



అ'పూర్వ' సమ్మేళనం

మానకొండూర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల 1975– 76 పదో తరగతి విద్యార్థులు కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. యాభై ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, యోగక్షేమాలను తెలుసుకుంటూ చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

అలుగు పారుతున్నా.. రైతుల్లో ఆందోళన



ఇల్లందకుంట: నిన్న మొన్నటి వరకు కురిసిన వర్షాలకు మండలంలోని పాతర్లపల్లి గ్రామ సమీపంలో నిర్మించిన చెక్‌డ్యామ్ అలుగు పారుతోంది. దీంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నా మరోవైపు పైనుంచి వచ్చే భారీ వరదతో చెక్‌డ్యామ్‌కు గండిపడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. గతేడాది వర్షాకాలంలో చెక్‌డ్యామ్ తెగిపోయింది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో రైతులే సొంత డబ్బులతో వేసవిలో తాత్కాలిక మరమ్మతు చేశారు. కానీ భారీ వర్షం పడితే ఎగువ నుంచి వచ్చే వరదతో చెక్‌డ్యామ్ తెగిపోయే ప్రమాదం ఉందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉపకాల్వ ఉన్నా లేనట్టే



మానకొండూర్: మండలంలోని ఎస్సారెస్పీ కాకతీయ కాలువ డీబీఎం 3 ఉప కాలువ ఉన్నా లేనట్టే తయారైంది. ముంజంపల్లి నుంచి మానకొండూర్, శ్రీనివాస్‌నగర్, జగ్గయ్య పల్లె వరకు ఉపకాల్వ ద్వారా సాగునీరు అందుతోంది. రెండేళ్లుగా ఉపకాలువ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండుకొని ఆనవాళ్లు కోల్పోయింది. దీంతో సాగునీరు చివరి ఆయకట్టుకు చేరే అవకాశం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో సిల్టు పేరుకుపోయిందని సాగునీరు విడుదల చేస్తే కాల్వకు గండ్లు పడే అవకాశం కూడా ఉందని, కాలువలోని సిల్టుతోపాటు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు చెత్తాచెదారాన్ని తొలగించాలని రైతులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ఎల్‌ఎండీలో పర్యాటకుల సందడి





తిమ్మాపూర్: ఎడతెరిపి లేని వర్షాలకు దిగువ మానేరు జలాశయం జలకళను సంతరించుకుంది. ఆదివారం సెలవు రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు ఎల్ఎండీకి చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు.